క్లుప్తంగా

జీపీ భవనం పనుల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ముగ్దుంపూర్‌లో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను శనివారం ఎంపీవో అబ్బాగౌడ్ పరిశీలించారు. సర్పంచ్ బీమన్‌పల్లి లక్ష్మీనారాయణ, కార్యదర్శి సాయిప్రణీత్‌రెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ గంగారాం ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టిపెట్టాలి



నిజాంసాగర్(జుక్కల్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులపై దృష్టిసారించాలని సిబ్బందికి డివిజనల్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని తున్కిపల్లి గ్రామ పంచాయతీని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఎంపీవో అబ్బాగౌడ్, కార్యదర్శి మతిన్ తదితరులు ఉన్నారు.

రోడ్డును బాగుచేయించాలి



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్‌లో గుంతలుగా మారిన రోడ్డును బాగు చేయాలని యూత్ ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు జుక్కల్‌లో సదరు రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. యూత్‌ఫోరం సభ్యులు గాయక్వాడ్ విఠల్, మారుతి, జాదవ్ సాయికర్ణ, అర్మాణ్, మారుతి, నర్సింగ్, క్రిష్ణ, శ్రీకాంత్, సిద్ధు, పండరి ఉన్నారు.

చెత్తను తొలగించారు



సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద(జుక్కల్): మండలకేంద్రంలో లోపించిన పారిశుధ్యంపై ఈనెల 11న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జీపీ అధికారులు స్పందించి, శనివారం చెత్తను తొలగించి, శుభ్రం చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

కల్వర్టు పనుల తనిఖీ

ఎల్లారెడ్డి: పట్టణంలోని 12వ వార్డులో జరుగుతున్న కల్వర్టు పనులను మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ శనివారం పరిశీలించారు. పనులను నాణ్యతగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. కౌన్సిలర్ నీలకంఠం తదితరులున్నారు.

సమాజ సేవపై శ్రద్ధచూపాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులు విద్యతో పాటు సమాజసేవపై శ్రద్ధ చూపాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. తాడ్వాయిలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలో విద్యార్థుల పాత్ర చాలా గొప్పదని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సయ్యద్ యూసూఫ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్: జిల్లాని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం కలెక్టర్ కార్యాలయ ఏవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. జిలా అధ్యక్షుడు జీవన్, నాయకులు ఉన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సాధన సంస్థ కో–ఆర్డినేటర్లు శ్రీనివాస్, మల్లేష్ సూచించారు. మండలకేంద్రంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో శనివారం సాధన సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్లీనరీకి తరలిన బీసీ నాయకులు

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన బీసీల రాజకీయ ప్లీనరీకి జిల్లాలోని వివిధ మండలాల నుంచి బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు తరలి వెళ్లినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు తెలిపారు. నాయకులు నాగరాజగౌడ్, గంగాధర్, తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనుల్లో సర్పంచ్ భర్త

భిక్కనూరు: జీపీ కార్మికులు సమ్మెలో ఉండటంతో పెద్దమల్లారెడ్డి సర్పంచ్ లక్ష్మి భర్త రాజలింగం గ్రామపంచాయతీ ట్రాక్టరును అన్ని వీధుల్లో తిప్పుతూ, ఇళ్లలోని చెత్తను సేకరించారు. చెత్తను డంపింగ్ యార్డు వద్ద వేశారు.

వ్యసనాల దారిలో యువత

- మద్యం, డ్రగ్స్‌కు బానిసవుతున్న వైనం
- డ్రంకన్‌డ్రైవ్‌లో పలువురికి జైలు
- ప్రశ్నార్థకమవుతున్న భవిత

మాచారెడ్డి: యువత వ్యసనాలకు బానిసవుతూ, భవితను ప్రశ్నార్థకంగా మార్చుకుంటున్నారు. మద్యం, డ్రగ్స్, పొగ తాగడం వంటి అలవాట్లకు బానిసవుతున్నారు. మండలంలో ఇటీవలి కాలంలో మద్యంతో పాటు గంజాయికి బానిసలైన యువకులు చాలా మంది ఉన్నారు. మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాకు ఓ యువకుడు గంజాయికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. పాపం రెక్కాడితే డొక్కాడని ఆ తల్లిదండ్రులు అప్పులు చేసి ఆస్పత్రుల చుట్టూ తిప్పినా లాభం లేకుండాపోయింది. ఆరోగ్యం క్షీణించంతో మృత్యువాత పడ్డాడు. ఒక్కగానొక్క కొడుకు అలా మృతి చెందడంతో ఆ తలిదండ్రులు గుండెలవిసేలా విలపించారు.మరో గ్రామానికి చెందిన యువకుడు పీకల దాకా మద్యం తాగి బైక్ నడుపుతూ మండల కేంద్రంలో పోలీస్ ఠాణా ఎదుటే బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలై ఆస్పత్రి పాలయ్యాడు. అదే గ్రామానికి చెందిన మరో యువకుడు మద్యం సేవించి ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి పడి ప్రాణాలు కోల్పోయాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఇటీవల ఘటనలు కోకొల్లలు ఉన్నాయి. ఇంకా పలు వ్యసనాలకు బానిసలై యువత నిర్వీర్యమౌతోంది. బాగా చదువుకొని ప్రయోజకులై కన్న వారి కల లు నెరవేరుస్తారనుకుంటే కొందరు కన్న వారికే భారమవుతున్నారు. పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువకుల్లో పరివర్తన తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా యువత మేల్కొనాలని, వారికి పోలీసులు, స్వచ్ఛందసంస్థలకు తగిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

■ మాచారెడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు సిరిసిల్ల వైపు నుంచి కారును అతి వేగంగా నడుపుతూ వెళ్తున్నాడు. గజ్యానాయక్ తండా చౌరస్తాలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా, అతి వేగం, అజాగ్రత్తగా దూసుకొస్తున్న ఆ కారును నిలిపివేశారు. సదరు యువకుడికి బ్రీతింగ్ అనలైజర్‌తో పరీక్షించగా మద్యం తాగినట్లు తేలడంతో కారును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. రెండు నెలల అనంతరం సదరు యువకునికి రెండు రోజుల జైలు రూ. 200లు జరిమానా విధించారు. ప్రస్తుతం ఇలాంటి ఘటనలు కోకొల్లలు. డ్రంకన్‌డ్రైవ్ కేసులతో పాటు మద్యం సేవించి ప్రమాదాలకు గురైన వ్యక్తుల్లో అధిక శాతం యువకులే ఉన్నారు.



మాచారెడ్డిలో డ్రంకన్‌డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

అవగాహన కల్పిస్తున్నాం..



డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ యువకులకు అవగాహన కల్పిస్తున్నాం. తాగి వాహనం నడిపే ముందు భార్య పిల్లలు, తల్లిదండ్రులను గుర్తు చేసుకోవాలని చెబుతున్నాం. తాగి వాహనం నడపడం వల్ల ఏదైనా జరగకూడనిది జరిగితే కుటుంబం వీధిన పడతారని అవగాహన కల్పిస్తున్నాం. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.

– రాజారాం, ఎస్సై, మాచారెడ్డి

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి





బిచ్కుందలో రోడ్డుపై ధర్నా చేస్తున్న కార్మికులు.. రాజంపేటలో వంటావార్పు నిర్వహిస్తున్న కార్మికులు

బిచ్కుంద(జుక్కల్)/రాజంపేట/తాడ్వాయి/లింగంపేట/భిక్కనూరు: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు జిల్లాలోని పలు మండలాల్లో చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. బిచ్కుందలో జీపీ కార్మికులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. రాజంపేటలో కార్మికులు వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. తాడ్వాయిలో కార్మికుల సమ్మెకు ఎర్రాపహాడ్ సర్పంచ్ బొక్కా నర్సారెడ్డి మద్దతు తెలిపారు. భిక్కనూరులోని సమ్మె శిబిరాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు సందర్శించి, మద్దుతు తెలిపారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామ కార్మికులు తెలిపారు.



తాడ్వాయిలో..



లింగంపేటలో..

పంట కాలువల్లో పూడికతీత



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నర్వ గ్రామ శివారులోని పంట కాలువల్లో శనివారం ఉపాధి కూలీలు పూడికతీత పనులు చేపట్టారు. పనులను గున్కుల్ సొసైటీ చైర్మన్ గొట్టం నర్సింలు పరిశీలించారు. ఫీల్డ్‌అసిస్టెంట్ సీహెచ్ ఈశ్వర్, ఉపాధి కూలీలు ఉన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాల నుంచి కాపాడాలంటూ కాచాపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 82వ రోజుకు చేరుకున్నాయి. శనివారం గ్రామానికి చెందిన రైతు సంఘం నేతలు దీక్షలో కూర్చుని ఫ్యాక్టరీ యాజమాన్యం వెంటనే స్పందించాలంటూ నినాదించారు.

జాబ్‌మేళా పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 23న ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా పోస్టర్లను శనివారం బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ఆవిష్కరించారు. జాబ్‌మేళాను యువత, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణ అధ్యక్షుడు భానుప్రసాద్, నాయకులు షేక్ మాజీద్, జావేద్, దినేష్ రెడ్డి, రాజు, నరేష్, పరుశురాంగౌడ్, కృష్ణ, పెరుమాండ్ల బుల్లెట్ ఉన్నారు.

ఇంటింటికి కాంగ్రెస్ ప్రచారం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు అయా గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఐటీ సెల్ చైర్మన్ మదన్‌మోహన్‌రావు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. నాయకులు నారాగౌడ్, ఎల్లేశం, జొన్నల రాజు, రఫీక్, రాజు, సాయిలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించండి



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని శివాజీ చౌక్ ప్రాథమిక బాలికల పాఠశాలలో కేవలం ఒకే గదిలో ఒకే టీచర్ పాఠశాలు చెబుతుందని దీంతో విద్యార్థులు తిప్పలు పడుతున్నారని, వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాలలో నాలుగు గదులు ఉన్నప్పటికీ మూడు గదులకు తాళం వేశారన్నారు. అధికారులు స్పందించి, విద్యార్థుల సమస్యను పరిష్కరించాలన్నారు.

నూతన కార్యవర్గం..

■ ఎల్లారెడ్డి మేరు సంఘం..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మండల మేరు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఎల్లారెడ్డి మండల మేరు సంఘం అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్, కార్యదర్శిగా సాయిలు, కోశాధికారిగా కృష్ణ, గౌరవ అధ్యక్షులుగా నర్సింలు, బాలరాజులను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

సేవాభారత్ యూత్..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి సేవాభారత్ యూత్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు శనివారం తెలిపారు. అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పాండు, కార్యదర్శిగా మౌళానా కుమార్, కోశాధికారిగా సాయిరాంలను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

■ మాచారెడ్డి తహసీల్దార్‌గా నర్సింలు



మాచారెడ్డి(కామారెడ్డి): మాచారెడ్డి తహసీల్దార్‌గా చింతల నర్సింలు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో మాచారెడ్డి డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన నర్సింలు పదోన్నతిపై బీబీపేట తహసీల్దార్‌గా పని చేసి, మళ్లీ ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సునీత సదాశివనగర్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

రైతుబంధు జిల్లా డైరెక్టర్‌గా..



దోమకొండ: రైతుబంధు జిల్లా డైరెక్టర్‌గా దోమకొండకు చెందిన అండెం శంకర్ రెడ్డిని నియమించారు. ఈమేరకు రాష్ట్ర అగ్రికల్చర్ కమిషనర్ రఘునందన్‌రావ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

ఆధ్యాత్మికం..

■ వైభవంగా పాశుపత రుద్రయాగం



కామారెడ్డి రూరల్: పట్టణంలోని కల్కినగర్‌లోగల కోటిలింగేశ్వర అభయ అంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శనివారం ఆలయ అర్చకుడు మశ్చేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పాశుపత రుద్రయాగం నిర్వహించారు. అంతకుముందు కోటిలింగేశ్వర స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు దొడ్లె మల్లేష్, నవీన్, కుమ్మరి అనిల్ పాల్గొన్నారు.

■ విఠలేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో శనివారం సంత్ నామ్‌దేవ్ సజీవ సమాధి మహోత్సవం సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

■ ఎల్లారెడ్డిలో నేడు బోనాల పండుగ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో నేడు బోనాల పండుగ నిర్వహించనున్నట్లు ముత్యాల పోచమ్మ ఆలయ కమిటి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జాజాల సురేందర్, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీ బీబీ పాటిల్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు.

■ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి గంజ్‌వర్తక సంఘం భవన ప్రాంగణంలోని అంజనేయ ఆలయం వద్ద శనివారం ఉదయం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. పట్టణంలోని పలు ఆలయాల్లోనూ ప్రతి మంగళవారం సామూహిక హనుమాన్ చాలీసా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించండి





కామారెడ్డిలో ధర్నా నిర్వహిస్తున్న ఎండీఎం కార్మికులు.. భిక్కనూరులో..

భిక్కనూరు/కామారెడ్డి టౌన్/ఎల్లారెడ్డిరూరల్/మాచారెడి: మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ, ఏఐకేఎంఎస్ సహా వివిధ కార్మిక సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం జిల్లాకేంద్రంలో సీఐటీయూ, మధ్యాహ్న కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. భిక్కనూరులో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డికి ఎండీఎం కార్మికులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంఈవో కార్యాలయం ఎదుట వంటావార్పు నిర్వహించారు. ఎల్లారెడ్డిలో ఎండీఎం కార్మికుల ధర్నాకు బీజేపీ నాయకులు మద్దతు పలికారు. అనంతరం ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. మాచారెడ్డిలో అఖి ల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సూర నర్సయ్య, కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపి, తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు.



మాచారెడ్డిలో..

ఇంటింటికి మొక్కల పంపిణీ





బోర్లంలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు.. నర్సన్నపల్లిలో మొక్కలను పంపిణీ చేస్తున్న నేతలు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామంలో ఎంపీపీ నీరజావెంకట్రాంరెడ్డి శనివారం హరితహారం కార్యక్రమంలో భాగంఆ ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. అంతకుముందు పల్లె ప్రకృతి వనంలో ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. జీపీ కార్యదర్శి సాయికుమార్, సర్పంచ్ సరళ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రావణి దేవేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ మంద శ్రీనివాస్ ఉన్నారు.

కామారెడ్డి రూరల్: మండలంలోని నర్సన్నపల్లి గ్రామంలో కామారెడ్డి ఇన్‌చార్జ్ ఎంపీపీ నరేష్ కుమార్ శనివారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్‌లను పంపిణీచేశారు. సర్పంచ్ ద్యాప హన్మాండ్లు, ఉపసర్పంచ్ ప్రవీణ్, సొసైటీ డైరెక్టర్ రాంరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ స్వామి, కార్యదర్శి నవనీత, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం చించొల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. మాజీ ఉప సర్పంచ్ కిషన్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ మహమ్మద్, అశోక్, రవి, మొగులయ్య, బాశెట్టి, మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, గంగారాం, పీరయ్య, రఫీ, సాయిలు, మాణిక్యం ఉన్నారు.



వీరేశం సేవలు మరువలేనివి



బాన్సువాడ: బీఆర్ఎస్ పార్టీ బీర్కూర్ మండల అధ్యక్షుడు లాడేగాం వీరేశం సేవలు మరువలేనివని, ఆయన మృతి తీరని లోటు అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వీరేశం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో శనివారం ఆయన పార్థీవదేహానికి స్పీకర్ వేసి నివాళులు అర్పించారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, నాయకులు గంగారం, శశికాంత్, సందీప్, ఎజాస్, లింగం తదితరులు ఉన్నారు .

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ





రామారెడ్డిలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు.. మాచారెడ్డిలో..

రామారెడ్డి(కామారెడ్డి)/మాచారెడ్డి(కామారెడ్డి): మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం టీఎస్ సీపీఎస్ ఈయూ తలపెట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర వాల్ పోస్టర్లను సంఘ సభ్యులు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు కుంట ఎల్లారెడ్డి మాట్లాడుతూ... సీపీఎస్ ఈయూ రద్దు కోసం రాష్ట్రశాఖ అధ్వర్యంలో తలపెట్టిన పాత పెన్షన్ సంకల్ప యాత్ర జూలై 16 నుంచి ప్రారంభమై కామారెడ్డి జిల్లాకు జూలై 25న చేరుకుంటుందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే రామారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో యాత్ర వాల్‌పోస్టర్లను సంఘ సభ్యులు ఆవిష్కరించారు.

సంక్షిప్తం

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బాన్సువాడ రూరల్: బోర్లం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ మైమూనా మస్రత్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

అంబేద్కర్ సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ

కామారెడ్డి రూరల్: మండలంలోని ఇస్రోజీవాడిలో అంబేడ్కర్ సంఘ భవనం అదనపు అంతస్తు నిర్మాణానికి శనివారం బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి భూమిపూజ చేశారు. సంఘ ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు రాగి జావ ప్యాకెట్ల పంపిణీ

గాంధారి/నిజాంసాగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం రాగి జావ ఇవ్వనున్నట్లు గాంధారి ఎంఈవో సేవులా తెలిపారు. శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలో జెడ్పీటీసీ శంకర్ నాయక్, హెచ్ఎంలకు రాగి జావ ప్యాకెట్లను అందించారు. మంగళవారం నుంచి విద్యార్థుల పంపిణీ చేయాలని సూచించారు. అలాగే జుక్కల్‌లోనూ రాగి జావా, బెల్లం పౌడర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

అల్బెండజోల్ మాత్రలను వేయాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల వైద్యాధికారిణి శ్రీలేక ప్రత్యే సమావేశం నిర్వహించారు. ఈ నెల 20న నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని 1–19ఏళ్ల మధ్య ఉన్న బాలబాలికలకు అల్బెండజోల్ మాత్రలను వేయాలని ఆమె సూచించారు.

ఆరేపల్లి వాసికి ఫొటోగ్రఫీలో అవార్డు

మాచారెడ్డి(కామారెడ్డి): కామారెడ్డిలో శనివారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్వంచ మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన ఫొటో గ్రాఫర్ ఏలేటి రఘువీరారెడ్డి ప్రథమ బహుమతిని గెలుచుకున్నాడు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ బహుమతి అందజేసినట్లు ఆయన తెలిపారు.

నర్సరీ పరిశీలన

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలకేంద్రంలోని చిన్న తక్కడ్‌పల్లి నర్సరీని శనివారం ఎంపీడీవో రాణి పరిశీలించారు. ఎంపీవో సూర్యకాంత్, కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో పేరెంట్స్ మీటింగ్

బాన్సువాడ రూరల్/కామారెడ్డి రూరల్/లింగంపేట(ఎల్లారెడ్డి): బాన్సువాడ, కామారెడ్డి, లింగంపేట మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని కోరారు.

పార్ట్‌టైం స్వీపర్ల రిలే దీక్షలు

కామారెడ్డి రూరల్: తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతూ కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన ప్రభుత్వ బడుల్లోని పార్ట్‌టైం స్వీపర్ల రిలే నిరహార దీక్షలు శనివారం 12వ రోజు కొనసాగాయి. సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు బాలయ్య, సిద్దిరాములు, మునీరోద్దీన్, సయ్యద్ హైమద్, రాములు, సహదేవ్, వీరేశం, అంజయ్య, సాయన్న, సరోజ, గంగారాం పాల్గొన్నారు.